జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


శనివారం | 25-10-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 492 పేజీలు: 4 వెల: రూ.7




## కొత్తూరు టీడీపీలో..
# భగ్గుమన్న వర్గపోరు

* టీడీపీ మండల కమిటీ ప్రమాణ స్వీకారానికి కలమట, లోతుగడ్డ వర్గం డుమ్మా
* స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్ర ప్రభావం
* ఆందోళనలో ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్

**కొత్తూరు, అక్టోబరు 24 (వార్త):** పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీలో వర్గ విభేదాలు మరోసారి తారాస్థాయికి చేరాయి. పార్టీ జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ మూర్తి సొంత మండలం కొత్తూరులోనే ఇటీవల జరిగిన కీలక కార్యక్రమంలో ఆయన గైర్హాజరు కావడం కలకలం రేపింది. సొంత మండలంలో జరిగిన టీడీపీ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దూరంగా ఉండటం.. ఈ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కొత్తూరులోని టీడీపీ కార్యాలయ ఆవరణలో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో గురువారం నూతన మండల కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. అయితే, ఈ కార్యక్రమానికి కలమట వెంకటరమణ మూర్తికి ఆహ్వానం అందలేదో, లేక ఉద్దేశపూర్వకంగానే దూరంగా ఉన్నారో తెలియకపోయినా... పార్టీ జిల్లా అధ్యక్షుడే సొంత మండల కార్యక్రమానికి హాజరు కాకపోవడం పార్టీలోని అంతర్గత కోల్డ్ వార్‌ను స్పష్టం కనిపిస్తోందని మండల నాయకులు గుసగుసలాడుతున్నారు. కొత్తూరు మండలంలో మరో టీడీపీ కీలక నాయకులుగా ఉన్న లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ (మండల పరిషత్ ఉపాధ్యక్షులు) వర్గం కూడా ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కాలేదు. ఎమ్మెల్యే ఎంజీఆర్ స్వయంగా పాల్గొన్నప్పటికీ, ముఖ్య నేతలు, నూతన కమిటీ ప్రతినిధుల్లో కొంతమంది గైర్హాజరు కావడం, కొత్తూరు మండలంలో వర్గ పోరు ఎంత తీవ్రంగా ఉందో తేటతెల్లం చేసింది. మండల టీడీపీ అధ్యక్షుడిగా అగతముడి మాధవరావుని నియమించడం పట్ల మండల నాయకులకు ఇష్టం లేకనో లేక గ్రూపు రాజకీయాల వల్లనో తెలియదుగానీ మండలంలో ఇలానే టీడీపీ నాయకులు ఎడముఖం, పెడముఖంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో టీడీపీలో వర్గపోరు ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తల మధ్య ఆందోళన నెలకొంది. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వర్గాలు ఇలా బహిరంగంగా తలపడుతుంటే, లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి తీవ్ర భంగపాటు తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలను గమనించిన పాతపట్నం నియోజకవర్గం పరిశీలకులు బి. త్రినాధ్‌రావు సైతం మిన్నకున్నారని కొందరు పేర్కొంటున్నారు. అధిష్టానం జోక్యం చేసుకోకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపు కష్టమేనని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.







# గోమాతకు సీమంతం

**మెళియాపుట్టి, అక్టోబరు24 (వార్త):** సర్వ దేవత నిలయమైన గోమాతకు మెళియాపుట్టి మండలంలోని పెద్దపద్మాపురం గ్రామంలో శుక్రవారం సీమంతం చేశారు. రిటైర్డు న్యాయమూర్తి యెన్ని ఢిల్లీశ్వర రావు నేతృత్వంలో గ్రామస్తులు.. గోమాతకు పసుపు, తిలకం దిద్ది, వాటిపై కొత్త చీరలను, పిండివంటలను పెట్టి సీమంత కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గోమాతకు కార్తీక నెలలో ఇలా పూజించటం వల్ల ఆగ్రామం, ఆ ప్రాంతా నికి మంచి జరుగుతుందని నమ్మకంతో ఈ కార్యక్రమం చేపట్టామని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఉపాధ్యాయులు లింగాల సంజీవరావు, సంపత్‌రావు, వెంకటేశ్వరరావు, ఘనశ్యాం, పి.శ్యాంసుందర్రావు, యు. వసంత్, షణ్ముఖ, గ్రామస్తులు, మహిళలు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

## కొడుకు చదువుకు..
# ఇల్లు తాకట్టు

* ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని వైనం
* జింకిభద్రలో లబోదిబోమంటున్న పేద కుటుంబం
* బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులకు వినతిపత్రం




**సోంపేట, అక్టోబరు 24(వార్త):** పిల్లలను ఉన్నత చదువులు చదివించి వాళ్ల భవిష్యత్తుకు ఒక ఆసరా కల్పించాలన్న సదుద్దేశంతో పేద కుటుంబాలు కూడా ఉన్నత చదువుల వైపు ఆలోచిస్తున్నాయి. ఇటువంటి పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం భరోసా ఇచ్చి ఫీజుల విషయంలో సహకారం అందిస్తేనే అటువంటి పేద పిల్లలు ఉన్నత విద్యా లక్ష్యాలను చేరుకుంటారు అనడంలో సందేహం లేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇంజనీరింగ్ తదితర విద్యార్థులకు కళాశాలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజుల విషయంలో చేస్తున్న ఒత్తిడి తట్టుకోలేక సోంపేట మండలం జింకుభద్ర గ్రామానికి చెందిన ఓ నిరుపేద కుటుంబం ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి మరీ ఫీజు కట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. షావుకారు జానకిరావు అలియాస్ జానీ టైలర్ వృత్తి సాగిస్తూ.. కుటుంబాన్ని ఓవైపు పోషిస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. జిల్లాలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం ఇంజనీరింగ్ కోర్సు చదివిస్తున్నాడు. తన కుమారుడికి సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్‌ను ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించలేదని ఆ మొత్తాన్ని మీరు చెల్లిస్తే తప్ప పరీక్షలకు హాల్ టికెట్ ఇవ్వబోమని యాజమాన్యం తేల్చి చెప్పేసింది. దీంతో ఏం చేయాలో తెలియక, కుమారుడి చదువు ఎక్కడ ఆగిపోతుందోనని భావించిన కుటుంబ పెద్ద ఉన్న ఇంటిని తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో ఒకేసారి రూ.61,200లు ఫీజు చెల్లించాడు. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధి గోవిందరాజులుకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రాన్ని జానకిరావు అందజేశారు. ఇది నా ఒక్క కుమారుడు సమస్య కాదని రాష్ట్రంలో చాలామంది పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎదుర్కొంటున్న పెద్ద సమస్య అని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


**సోంపేట అక్టోబరు24(వార్త):** సోంపేట మండలం పాలవలస గ్రామానికి చెందిన తామాడ యాదవరావు (45) శుక్రవారం సాయంత్రం కొర్లాం టి శాసనం గ్రామాల మధ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి బంధువులు అందించిన సమాచారం మేరకు పాలవలస గ్రామానికి దగ్గర్లోనే ఉన్న నదిలో స్నానం కోసం వెళ్ళిన యాదవరావు తిరిగి స్కూటీపై వస్తు జీకే నాయుడు బట్టి వద్ద రోడ్డు ఎక్కుతుండగా హరిపురం నుంచి కొర్లాం వైపు వేగంగా వచ్చిన టాటా మ్యాజిక్ వాహనం వెనుక నుంచి ఢీకొంది. తీవ్ర గాయాల పాలైన యాదవ రావును 108 వాహనంలో సమీపంలోనే హరిపురం ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే యాదవ మృతి చెందారు. గుజరాత్‌లో కర్ర మిల్లులో కార్మికులుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యాదవరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది నెలల క్రితం గుజరాత్ నుంచి స్వగ్రామం వచ్చిన యాదవరావు మళ్ళీ తిరిగి గుజరాత్ వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో మృత్యువు వెంటాడింది. యాదవ మృతితో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పాలవలస గ్రామంలో విషాదం అలుముకుంది. బారువ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఎంపికైన కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు24(వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖలో హోం గార్డులుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల పోలీసు కానిస్టేబుల్ నియా మక పరీక్షల్లో ఎంపికైన ఏడుగురు హోంగార్డులను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అభినందించారు. పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డులు ఎస్.నరేష్, ఎ.ఎర్రన్న, డి.హరకేశామ్, జె.వెంకటరమణ, జి.చిన్నారావు, సీహెచ్ సంజీవరావు, వై.తిరుపతిరావులను ఎస్పీ సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డులుగా విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో తమ లక్ష్యాన్ని సాధించి పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం గర్వకారణమన్నారు.





## ఏపీ సురక్ష యాప్‌తో కల్తీ మద్యం కట్టడి

**శ్రీకాకుళం, అక్టోబరు24(వార్త):** మద్యం కల్తీని అరికట్టడంలో ఏపీ సురక్ష యాప్ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఓ మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, మద్యం బాటిళ్లపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నాణ్యతను సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు. కల్తీ మద్యం ప్రజల ప్రాణాలను హరిస్తోందని, అందుకే ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను వినియోగించి అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇక యువత పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బాపూజీ కళామందిర్ వద్ద విశాలాంధ్ర సంచార పుస్తకాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ, నేటి యువత సోషల్ మీడియాలో ఎక్కువ సమయం గడుపుతూ అజ్ఞానం వైపు నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాంస్కృతిక, సాహిత్య, ఆరోగ్య రంగాలకు చెందిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. అలాగే గార మండలంలోని తూలుగు గ్రామంలో నిర్వహించిన మరో కార్యక్రమంలో పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. లేగదూడల ప్రదర్శనలో విజేతలకు బహుమతులు అందజేశారు.

## నవంబర్ 2న కూర్మనాథ స్వామి తెప్పోత్సవం

**శ్రీకాకుళం, అక్టోబరు24(వార్త):** ప్రముఖ పుణ్యక్షేత్రం కూర్మనాథ స్వామి వారి వార్షిక తెప్పోత్సవం నవంబర్ 2న వైభవంగా నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) కె.నరసింహా నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీక శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పవిత్ర ఉత్సవం ఆరోజు సాయంత్రం 4 గంటలకు శ్వేత పుష్కరిణి వద్ద ప్రారంభమవుతుందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఈవో వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని, తెప్పోత్సవంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదుపై సలహాలివ్వండి

**శ్రీకాకుళం, అక్టోబరు24(వార్త):** ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదుపై సూచనలు సలహాలు ఇవ్వాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రోరల్ రోల్స్ నమోదు, తొలగింపులపై సమాచారం అందించాలన్నారు. రాజకీయ పార్టీల సూచనలు, సలహాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఫారం-6, 7, 8ల సమాచారం తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో తెలుగు దేశం పార్టీ నుండి పి.యం.జె. బాబు, జనసేన నుండి బి.అర్జున్ కుమార్, బిజెపి నుండి పి. సుందర బాబు సింగ్, బిఎస్పి నుండి. ఎల్.సోమేశ్వరరావు, వైయస్సార్ సిపి నుండి ఆర్. శంకరరావు, సిపిఎం నుండి ఎం.గోవిందరావు, కాంగ్రెస్ నుండి కె.వి.ఎల్.ఎస్. ఈశ్వరి, సి సెక్షన్ సూప రింటెండెంట్ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## శివపార్వతుల విగ్రహ ప్రతిష్ఠలో బీజేపీ నేత పోకతోట

**కవిటి, అక్టోబరు 24 (వార్త):** కవిటి మండలం రాజపురం గ్రామంలో శివపార్వతుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో బీజేపీ నేత, రవితేజ డెవలపర్స్ అధినేత పోకతోట సింహాచలం పాల్గొ న్నారు. స్వామి వారి రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. సింహాచలంను గ్రామ పెద్దలు రత్నాల బైరేగి చౌదరి ఆహ్వానం పలికి దుశ్శాలువతో సత్కరించారు. కార్య క్రమంలో కణితి విష్ణుమూర్తి, మురళీ, గ్రామస్థులు పాల్గొన్నారు.



# 2029 నాటికి ప్రతి ఇంటికో ఉద్యోగం లక్ష్యం

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు
- పాతపట్నం మెగా మేళాలో 301మంది ఎంపిక

**పాతపట్నం, అక్టోబరు 24(వార్త):** స్వర్ణాంధ్ర ప్రదేశ్ లక్ష్యంలో భాగంగా 2029 నాటికి రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో ఒక ఉద్యోగం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పాతపట్నంలోని కిరణ్మయి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో నైపుణ్యం, ఉన్నత విద్య అభ్యసించిన నిరుద్యోగులు వేలాదిగా ఉన్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహిస్తుందన్నారు. ఇటువంటి అవకాశాలను యువతీ యువకులు సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించడం ఎంతో గొప్ప విషయమని ఆయన అభినందించారు. ఈమెగా జాబ్ మేళాకు మొత్తం 482 మంది యువతీ యువకులు హాజరు కాగా, వారిలో 301మంది వివిధ ప్రముఖ కంపెనీలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఉరిటి సాయికుమార్ ప్రకటించారు. డాక్టర్ రెడ్డీస్, రాయల్ ఎన్‌ఫీల్డ్, హెటిరో డ్రగ్స్‌తోపాటు 11 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన ఈ అవకాశాన్ని అంది పుచ్చుకొని ఉద్యోగాల్లో చేరాలని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయికుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో కిరణ్మయి విద్యా సంస్థల ఎం.డి. తూలుగు తిరుపతిరావు, ప్రిన్సిపాల్ జగన్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# ఇళ్ల కోసం వచ్చే నెల 5లోగా దరఖాస్తు చేసుకోండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు
- క్యాంప్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

**కోటబొమ్మాళి/ సంతబొమ్మాళి, అక్టోబరు24 (వార్త):** అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో గృహనిర్మాణ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి పక్కా ఇళ్లు నిర్మించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అందుకు అనుగుణంగా అధికారులు సమగ్ర ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అర్హులను గుర్తించి త్వరలో నూతన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో ప్రతి పేదవాడు దరఖాస్తు చేసుకునేలా చూడాలని ఆదేశించారు. తొలుత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను సావధానంగా విని, నాణ్యమైన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధిక సంఖ్యలో సొంత ఇళ్లు లేదని మంజూరు చేయాలని ప్రజలు వినతులు అందజేశారు. ఇళ్లు లేని నిరుపేదలు ఆయా వార్డు, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోని, గృహ నిర్మాణ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వచ్చే నెల 5లోగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.పేదల ఇబ్బందులు గమనించిన కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మా ణంపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ ప్రాజెక్టు అధికారి రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి పురస్కరించుకుని సర్దార్ యూనిటీ మార్చ్ ను ప్రారంభించ నున్న నేపథ్యలో ఇందుకు సంబంధిచి గోడపత్రికను మంత్రి చేతుల మీదుగాఆవిష్కరించారు.ఎన్‌వైకె అధికారులు పాల్గొన్నారు.

### ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించండి

మేజర్ పంచాయతీ పరిధిలో గల ఇంటి పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



పంచాయతీ అధికారులను ఆదేశించారు. కోటబొమ్మాళి పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమీక్షా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీ పరిధిలోని ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసు జారీ చేసి ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పంచాయతీల్లో నివసిస్తున్న ఇళ్ల లబ్ధిదారులు, వాణిజ్య దుకాణాలు, పరిశ్రమలు ఇంటి పన్ను వసూలు, సాధించాల్సిన లక్ష్యాల వివరాలను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు ను అడిగి తెలుసుకున్నారు.డిసెంబర్ లోగా ప్రతీ ఇంటి విలువ లెక్కించి సమగ్ర ఇంటి పన్ను వివరాలు సేకరించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి యజమానికి డిమాండ్ నోటీసు అందిస్తున్నది లేనిది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను సకాలంలో చెల్లింపు కోసం సామాజిక బాధ్యతగా వినియోగదారులు ముందుకురావాలని కోరారు. ఆదాయ వనరులను వినియోగించుకొని సమష్టి కృషితో పంచాయతీల అభివృద్ధి దిశగా పయనిద్దామన్నారు. నియోజక వర్గంలోని ఇంటి స్థలం కలిగిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వచ్చే నెల 5వ తేదీ లోగా ఆయా సచివాలయం డిజిటల్ అసిస్టెంట్, మండల తాసిల్దార్ లకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్తమ్మ తల్లి ఆలయాభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. మండలంలోని నర్సింగ పల్లి గ్రామం వద్ద రూ .3.75 కోట్లతో నిర్మించనున్న విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని గ్రామాల్లో అవసరమైన చోట్ల శాసన వాటికకు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆలాగే జూనియర్ కళాశాల మైదానంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని స్పష్టం చేశారు. నూతనంగా గ్రంథాలయం భవన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గ్రామ పంచాయతీ షాపింగ్ స్థానంలో నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి ఐదుగురు లబ్ధిదారులకు రూ.3.5 లక్షలు చెక్కులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, కోటబొమ్మాళి వ్యవసాయ కమిటీ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, కొత్తమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ కె.గోవిందరావు, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, విద్యుత్ శాఖ ఏడి జి.వి.సురేష్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎం.సుధాకర్, తాసిల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఓ ఫణేంద్ర కుమార్, ఆర్డబ్ల్యూఎస్ డీఈ ఎస్.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### క్వాంటమ్ క్లిష్టం కాదు..

# అర్థం చేసుకునే పద్ధతి ముఖ్యం



- ఐబీఎం శాస్త్రవేత్త సాయి శంకర్
- ఆర్జీయూకేటీలో ముగిసిన 'క్విసిక్ ఫాల్ ఉత్సవం

**శ్రీకాకుళం, అక్టోబరు24(వార్త):** క్వాంటమ్ గణన సూత్రాలు క్లిష్టంగా అనిపించినా, సరైన పద్ధతిలో నేర్చుకుంటే అవి సులభంగా అర్థమవుతాయని ఐబీఎం క్వాంటమ్ పరిశోధక శాస్త్రవేత్త సాయి శంకర్ అన్నారు. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) శ్రీకాకుళం ప్రాంగణంలో జరుగుతున్న 'క్విసిక్ ఫాల్ ఉత్సవం-2025' నాలుగో రోజు ఆయన ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి సంక్లిష్ట క్వాంటమ్ సూత్రాలను సాధారణ జీవితంలోని ఉదా హరణలతో పోల్చి వివరించిన ఆయన, భవిష్యత్ సాంకేతికతలో క్వాంటమ్ కీలక పాత్ర పోషిస్తుందని ఉద్ఘాటిం చారు. ఈ జ్ఞానోత్సవంలో 15,000 మందికి పైగా విద్యార్థులు ప్రత్యక్షంగా, అంతర్జాలం ద్వారా చురుగ్గా పాల్గొ న్నారు. ఈ సందర్భంగా, సీడ్యాక్-హైదరాబాద్ జ్ఞాన సహకారి అభిజిత్ తేజ్, 'దేశీయ క్వాంటమ్ గణన అనుకరణ సాధన సంపత్తిపై ఆచరణాత్మక ప్రదర్శన నిర్వహించి, క్వాంటమ్ రంగంలో భారతదేశం సాధిస్తున్న పురోగతిని వివరించారు. ఐబీఎం క్వాంటమ్ రాయబారి సౌమ్య రంజన్ స్వైన్ క్వాంటమ్ అల్గోరిథమ్‌లపై ఉప న్యాసం ఇచ్చి, విద్యార్థులకు అన్వయాత్మక దృక్పథం కల్పించారు. సాయి శంకర్ పి. అంతర్జాతీయ పరిశోధనలతో పాటు భారత ప్రభుత్వ జాతీయ క్వాంటమ్ లక్ష్యం, అమరావతి క్వాంటమ్ లోయ వంటి ముఖ్యమైన ప్రాజెక్టుల గురించి వివరించి, దేశ సాంకేతిక ప్రగతికి ఈ ప్రాజెక్టులు దిశానిర్దేశం చేస్తున్నాయని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన సాంకేతిక కార్యక్రమంలో డేటా టెక్ ప్రధాన సాంకేతిక అధికారి డాక్టర్ జ్ఞాన్ యల్లా క్విస్కిట్ పై ఆచరణాత్మక కార్యగోష్ఠి నిర్వహించారు. ఇందులో విద్యార్థులు క్వాంటమ్ విద్యుత్ వలయాలు, కొలతలు, కార్యక్రమ రచన సాధనాలపై ప్రత్యక్ష అనుభవం పొందారు. ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ సంచాలకులు ఆచార్య బాలాజీ, పరిపాలన అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఆర్థిక అధికారి డాక్టర్ వాసు, సమన్వయకర్తలు డాక్టర్ రవి గేదెల, కంప్యూటర్ శాస్త్ర విభాగపతి రమేష్, అధ్యాపకులు పర్యవేక్షించారు.

## మతిస్థిమితం లేని మహిళపై సీఐకు ఫిర్యాదు

**జలుమూరు, అక్టోబరు 24(వార్త):** చల్లవానిపేటలో మతిస్థిమితం లేని ఓమహిళ తన ముగ్గురు ఆడపిల్లలతో భిక్షాటన చేయిస్తున్నందున వారికి రక్షణ కల్పించి, ఆ మహిళపై చర్యలు చేపట్టాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావుకు గురువారం మధ్యాహ్నం సిడిపిఓ వంశీప్రియ ఫిర్యాదు చేశారు బాలికలను సంరక్షించేందుకు ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఆమె వెంట సర్పంచ్ పెంచిరెడ్డి రామచంద్రరావు మహిళ సంరక్షణ కార్యదర్శి, చిలకలపూడి శివకుమారి, అంగన్వాడి కార్యకర్త ఒగ్గు కొండమ్మ, సూపర్వైజర్ సీతారత్నం, మనోహరి పాల్గొన్నారు.



# సమాజ సేవకు దాతలు ముందుకు రావాలి

**-కొర్ల కన్నారావు సేవలు అభినందనీయం**

**-పలాస ఎంఎల్ ఏ గౌతు శిరీషా**

**-హరిపురంలో విజయవంతమైన వైద్య శిబిరం**

**మందస, అక్టోబరు 24(వార్త):** సమాజసేవకు దాతలు ముందుకు రావాలని, పేదలకు సేవలు అందివ్వాలని పలాస ఎంఎల్ఎ గౌతు శిరీషా కోరారు. మందస మండలంలోని హరిపురంలో గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు, లయన్స్ క్లబ్ కోస్టల్, హరిపురం ఆధ్వర్యంలో కేన్సర్, వ్యాధుల నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం, గుండె వ్యాధులు, కిడ్నీవ్యాధులకు సంబంధించి ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఎంఎల్ఎ శిరీషా అనంతరం మాట్లాడుతూ పేదలకు సాయపడే గుణం ప్రతీ ఒక్కరికీ ఉండాలన్నారు. గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ గా కొర్ల కన్నారావు సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. దానగుణం, సేవాగుణం కలిగి, పేదలకు తోడ్పడాలన్నారు. సమాజసేవతో మానవజీవితానికి సార్థకత లభిస్తుందన్నారు.



శిబిరంలో రక్త పరీక్షలు, స్కానింగ్, టుడీ ఎకోస్కాన్, మెమోగ్రాఫీ స్కాన్ తదితర పరీక్షలను ఉచితంగా అందజేశారు. రాగోలు జెమ్స్ హాస్పిటల్ సూపర్ స్పెషాలటీ వైద్యులు భరత్, చిన్మయి, అనుషా, సాహితీప్రియ, మానస రోగులకు సేవలందించారు. సుమారు 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా, వీరిలో 43మందికి మెరుగైన వైద్యం అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, దేవరశెట్టి మార్కండేయులు, తలగాన రాజశేఖర్, మార్పు మన్మథరావు, మండెల్లి లక్ష్మణరావు, భైరిశెట్టి గున్నయ్య, పుల్లా వాసుదేవు, కొంచాడ సురేష్ కుమార్, మార్పు వెంకటేశం, సాలిన మాధవరావు, చౌదరి మురళీకృష్ణ, కొత్ర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# మందసలో విద్యార్థులకు పలు పోటీలు



**మందస, అక్టోబరు 24(వార్త):** భారత రాజ్యాంగదినోత్సవం పురస్కరించుకుని మందస మండల విద్యాశాఖ కార్యాలయంలో 20 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, రైటింగ్, డిబేట్, క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాలకు ముగ్గురు విద్యార్థులు చొప్పున ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేయడం జరిగిందని మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు చెప్పారు. నియోజకవర్గం స్థాయికి విద్యార్థులు బి.శాలిని(కేజీబీవీ, మందస), ఎం.అమృత (జడ్పీహెచ్ఎస్, మందస, పొత్తంగి-సిరిపురం), బి.లాస్య(జడ్పీహెచ్ఎస్, మందస) ఎంపికయ్యారు. ఈ పోటీల నిర్వహణకు నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసి పోటీలు నిర్వహించారు. నిర్వహణ కమిటీ సభ్యులైన కర్రి జానకిరామ్(హిస్టరీ లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కాలేజ్, మందస), టి.నాగభూషణం(అర్థశాస్త్రం లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మందస), బి.సాల్మన్ సుందర్, ప్రధానోపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, సొండిపూడి), కె.రమణమూర్తి (ప్రధానోపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, జీఆర్ పురం), సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు, వై.తులసీదాస్, ఎస్.కిరణ్, తేజేశ్వరరావు, భాగ్యలక్ష్మి పాఠశాల వారీగా సబ్జెక్టు ఉపాధ్యాయులు హాజరయ్యారు. విద్యార్థులకు పోటీలు ఎంతో అవసరమని, భారత రాజ్యాంగం, భారత జాతీయ ఉద్యమం.. ఇటువంటి పోటీలకు ఎంతో ఉపయోగకరమని మందస మండల మండల విద్యాశాఖాధికారులు ఎం.లక్ష్మణరావు, ఎం.భాస్కర రావు తెలిపారు.

# వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

**కొత్తూరు, అక్టోబరు 24 (వార్త):** రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) చేపట్టిన "కోటి సంతకాలు" సేకరణ కార్యక్రమం కొత్తూరు మండలంలో ఉధృతంగా జరిగింది. మండల పార్టీ అధ్యక్షులు గండి వలస ఆనందరావు ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు గండి వలస ఆనందరావు మాట్లాడుతూ, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేందుకు, ప్రజలపై వైద్య సేవలను భారం చేసేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేదల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ పార్ట్నర్షిప్) విధానంలోకి తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్, ఎంపీటీసీ లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు




చింతాడ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ దూలి అప్పన్న, నాయకులు పాపారావు, పోలయ్య, పకీరు, నగేష్, కృష్ణమోహన్, సర్పంచ్ నాస బాలకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని సంతకాలు చేశారు. సేకరించిన సంతకాలను గవర్నర్‌కు అందజేసి, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసీపీ నాయకులు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతుండటాన్ని ఈ కార్యక్రమం నిరూపించింది.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు పరామర్శ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 24(వార్త):** నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ మున్సిపాలిటీలో పర్యటించారు. 23 వ వార్డు బెల్లు పడా కాలనీ లో మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాద%శీ% సంభవించింది. జనసేన కుటుంబ సభ్యులు చెట్టి ప్రసాద్,చెట్టి అనిల్ లు ఇంట్లో రెండవ, అంతస్తులో షార్ట్ సర్క్యూట్ విద్యుత్ ప్రమాదం జరిగినందువలన మంటలలో కాలిపోయిన గృహపకరాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి సుమారుగా మూడు లక్షల రూపాయలు విలువైన వెండి, కంచు ఇత్తడి, ఫర్నిచర్స్ మొదలగు సామాన్లు మంటల్లో కాలి పూర్తిగా బూడిదయ్యాయి, మున్సిపాలిటీ జనసేన పార్టీ ఇన్చార్జ్ రోకల్ల భాస్కరరావు సమాచారం మేరకు కుటుంబ సభ్యులను పరామర్శించి ఒక నెలకు సరిపడిన నిత్యవసర సరుకులు అందజేశారు .అలాగే కుటుంబ సభ్యులు ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు చీకటి కృష్ణయ్య,మరియు కవిటి మండల నాయకులు బైపల్లి.దాలయ్య , జనసేన పార్టీ జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు కదంబల ప్రశాంత్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## పురుగుల నివారణకు 'అగ్ని అస్త్రం'

**కొత్తూరు, అక్టోబరు 24(వార్త):** మాహాసింగి గూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ 'అగ్ని అస్త్రం' అనే సేంద్రీయ పురుగు నివారిణి తయారీపై శుక్రవారం నాడు రైతులకు అవగాహన కల్పించారు. శ్రీకాకుళం జిల్లా డిపిఎం ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు, యూనిట్ ఇన్చార్జి చిన్నమ్మి ఆధ్వర్యంలో 20 లీటర్ల అగ్ని అస్త్రం తయారు చేశారు. అధిక వర్షాల కారణంగా పంటలలో (వరి, వంగ, బెండ, కంది) వచ్చే కాండం తొలిచే పురుగులను నివారించడానికి రసాయన పురుగు మందులకు బదులుగా దీనిని వాడుకోవాలని రైతులకు సూచించారు. ఈ అగ్ని అస్త్రం తయారీకి వెల్లుల్లి, పచ్చిమిర్చి, పొగాకు కాడలు, వేపాకులు, నీరు, మూత్రాన్ని వినియోగించారు. తయారు చేసిన ద్రావణాన్ని ఒక ట్యాంకుకు అర లీటరు చొప్పున సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలని, ఇది మూడు నెలల వరకు నిల్వ ఉంటుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్చార్జి చిన్నమ్మి, ఐసిఆర్పి మోకలింగం రమణమ్మ, మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వర ఆలయ పనుల పరిశీలన



**సోంపేట, అక్టోబరు 24(వార్త):** జింకుభద్ర గ్రామంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఎంపీపీ డాక్టర్ ని మ్మన దాసు శుక్రవారం పరిశీలించారు. ఎంతో పురాతనమైన ప్రఖ్యాతిగాంచిన ఈ ఆలయాన్ని మరింత అందంగా తీర్చిదిద్దాలన్న గ్రామస్తుల ఆలోచనకు ఎంపీపీ డాక్టర్ దాసు కూడా సహకారం అందిస్తున్నారు. ఈ సందర్భంగా కంచిలి ఎంఈఓ సప్పటి శివరాం ప్రసాద్ తదితరులతో కలిసి స్వామివారిని దర్శించారు. ఆలయ నిర్మాణ పనుల విషయమై చర్చించారు.

## రేపు సోంపేటలో విద్యుత్ అంతరాయం

**సోంపేట, అక్టోబరు 24(వార్త):** సోంపేట విద్యుత్ సబ్స్టేషన్ టౌన్ ఫీడర్ పరిధిలో 26న ఆదివారం ఆర్‌డిఎస్ఎస్ పనుల నేపథ్యంలో విద్యుత్ అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సోంపేట పట్టణంతో పాటు జింక్ భద్ర, బెంకిలి గ్రామాలకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## పొలం గట్లపై కూరగాయల సాగు



**సారవకోట,అక్టోబరు 24(వార్త):** సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలం గట్లపై రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. సారవకోట, అన్నుపురం, బద్రి, గుమ్మపాడు, కొత్తూరు, గోపినాథపురం తదితర గ్రామాల్లో రైతులు చిక్కుడు, బీరకాయలు, కంది పంటలు సాగు చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. గట్లుపై కూరగాయలు, బంతి పూలు సాగుతో వరి పంటకు ఆశించే తెగుళ్ల ముందుగా గుర్తించవచ్చు.

## తాగునీటిని అందించేందుకు చర్యలు

**పోలాకి, అక్టోబరు 24(వార్త):** పోలాకి మండలం మగతపాడు పంచాయతీలో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షురాలు చింతాడ భారతి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పంచాయితీలోని అప్పారావుపేట కాలనీలో జలజీవన్ మిషన్లో భాగంగా కుళాయిలను బిగించారు. కానీ రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో రవికుమార్ తాగు నీటిని అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సిద్ధాశ్రమ చోరీ కేసులో నిందితుడు అరెస్టు



**నరసన్నపేట, అక్టోబరు 24(వార్త):** నరసన్నపేట సిద్ధాశ్రమంలో ఇటీవల జరిగిన చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేశామని ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం నరసన్నపేట సీఐ ఆఫీస్లో మాట్లాడారు. ఆరు పంచలోహ విగ్రహాలు చోరీకి గురి అయ్యాయని చెప్పారు. నిందితుడు శుక్రవారం నరసన్నపేట జమ్మూ వద్ద అనుమానాస్పదంగా ఉండటంతో పట్టుకొని ప్రశ్నించగా చోరీ కేసు చేసినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 24(వార్త):** రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఇచ్ఛాపురం మండలస్థాయి పోటీలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఆదేశానుసారం ఇరువురు మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణలో నిర్వహించారు ఈ పోటీలలో క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. మొత్తం 16 ఉన్నత పాఠశాలల్లో 62 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థుల్ని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రథమ స్థానంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల కొత్తశాసనం విద్యార్థిని కే. స్నేహ, ద్వితీయ స్థానంలో మున్సిపల్ బాలికొన్నత పాఠశాల ఇచ్ఛాపురం విద్యార్థిని ఎస్ .దీక్ష, తృతీయ స్థానంలో పురుషోత్తపురం మోడల్ స్కూల్ విద్యార్థి దీపక్ కుమార్ విజేతలుగా నిలిచారు. వీరిలో నియోజక వర్గం స్థాయి పోటీల్లో చివరి విజేతను ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ విద్యార్థి ఎమ్మెల్యే గా ఎన్నిక చేసిన విద్యార్థిని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి రాజ్యంగ దినోత్సవం లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. కార్యక్రమంలో ఇరువురు మండల విద్యాశాఖాధికారులు కురమాన అప్పారావు, ఎస్. విశ్వనాథం , న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు పి. భాస్కరరావు, ఎన్ రాజశేఖర్, బి నీలిమ, జె శంకరరావు మరియు బాలికొన్నత ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎంఅర్సి సిబ్బంది సిఅర్ఎంటిలు అర్. దేవరాజు, కే.సోమేశ్వరరావు, సి హెచ్ సత్యనారాయణ,సి హెచ్ మోహనరావు, అర్.తులసీరావు, బి.గణేష్ పాల్గొన్నారు.

## రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు



**సారవకోట, అక్టోబరు 24(వార్త):** అక్కివలస గ్రామానికి సమీపంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాకివలస నుంచి జలుమూరు మండలం శ్రీమన్నారాయణ పురం, సారవకోట నుంచి బద్రి వెళ్లే రోడ్డుకు ఈ విద్యుత్ స్తంభాలు అడ్డంగా ఉన్నాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే భారీ వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## మండల స్థాయి వ్యాసరచన పోటీలు



**నరసన్నపేట, అక్టోబరు 24(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎంఈఓలు శాంతారావు, పి. దాలినాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల స్థాయి నుంచి ఎంపికైన 43 మంది విద్యార్థులకు మండల స్థాయిలో ఎస్సై రైటింగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సీఆర్ఎంటీలు గిరిధర్, పెద్దవాడు, కామేష్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.ఈ పోటీ లో ముగ్గురు విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఎంఈవోలు శాంతారావు, దాలినాయుడు తెలియజేశారు. ఈ సందర్భంగా కంబకాయ ఉన్నత పాఠశాల నుండి ధనుంజయ, భరత్ సాయి, బొరిగి వలస పాఠశాల నుండి తేజస్వి విజేతలుగా నిలిచారు. వీరికి ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

## ఆటోమొబైల్ ట్రేడ్‌పై విద్యార్థులకు అవగాహన

**పలాస, అక్టోబరు 24(వార్త):** పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ లో వృత్తి విద్య ఉపాధ్యాయులు వై.యశ్వంత్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆటోమొబైల్ ట్రేడ్ విద్యార్థులు తరపున, విద్యార్థులకు పరిశ్రమలోని అనుభవాన్ని దగ్గరగా పరిచయం చేస్తూ అద్భుతమైన అవకాశాన్ని కల్పించిన పలాస ఆర్టీసీ డిపో మేనేజర్, వర్క్‌షాప్ సిబ్బందికి విద్యార్థులు ధన్యవాదాలు తెలియజేశారు. పలాస ఆర్టిసి సిబ్బంది చూపిన ఆదరణ, సహకారానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.




## 'కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోంది'

**కొత్తూరు, అక్టోబరు 24 (వార్త):** కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మద్యం అమ్మకాలు, అక్రమ దందాలు అదుపు తప్పుతున్నాయని, రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సంచలన ఆరోపణలు చేశారు. ప్రభుత్వం కేవలం ఆదాయంపై దృష్టి పెట్టి, ప్రజల ఆరోగ్యాన్ని, సామాజిక శ్రేయస్సును పూర్తిగా విస్మరించిందని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు, పంపిణీ నెట్‌వర్క్‌లు అధికార పార్టీ నేతల అండదండలతోనే నిరాటంకంగా నడుస్తున్నాయని రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల దొరికిన నకిలీ మద్యం తయారీ కేంద్రాలలో అధికార పార్టీకి చెందిన వ్యక్తుల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోందని ఆమె ధ్వజమెత్తారు. "నాసిరకం, కల్తీ మద్యం విక్రయాల వల్ల అనేక మంది నిరుపేదలు అనారోగ్యాల పాలవుతున్నారు, కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ ప్రాణ నష్టానికి కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాలి" అని ఆమె డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం కొద్ది నెలల్లోనే ఎన్నికలకు ముందు ఇచ్చిన మద్యం నియంత్రణ హామీని గాలికొదిలేసిందని విమర్శించారు. "రాష్ట్రంలో ప్రతి గ్రామంలో, ప్రతి మూలలో బెల్టు షాపులు పునరుద్ధరించబడ్డాయి. దీనివల్ల ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయి" అని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అమ్మకాలను డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, బెల్టు షాపులు, పర్మిట్ రూముల్లో యథేచ్ఛగా అక్రమ, నకిలీ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం కోల్పోవడమే కాకుండా, ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని అన్నారు. నకిలీ మద్యం కుంభకోణంలో నిజాలు బయటపడుతుంటే, అధికార పార్టీ నేతలు కేసును తప్పుదోవ పట్టించడానికి, రాజకీయ ప్రత్యర్థులపై బురద జల్లడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. సంబంధం లేని తమ పార్టీ నేతలపై నిందలు వేస్తూ, తప్పుడు వీడియోలు, వాట్సాప్ చాట్‌లను సృష్టించి ప్రచారం చేస్తున్నారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. మద్యం నియంత్రణ అనేది ఎన్నికలకు ముందు టీడీపీ ఇచ్చిన ప్రధాన హామీ. కానీ నేడు ఆ హామీని గాలికి వదిలేసి, వేల కోట్ల రూపాయల ఆదాయం కోసం ప్రజల




జీవితాలను పణంగా పెడుతున్నారు" అని ఆమె విమర్శించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో అక్రమ మద్యం దందా, కల్తీ మద్యం తయారీ యథేచ్ఛగా జరుగుతోందని, ప్రజలు మరణిస్తున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని అన్నారు. ప్రజారోగ్యం, శాంతిభద్రతల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మద్యం విక్రయాలపై నియంత్రణ విధించాలని, అక్రమ, కల్తీ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తరఫున ఆమె డిమాండ్ చేశారు.

## ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



**ఇచ్ఛాపురం, అక్టోబరు 24(వార్త):** మెడికల్ కాలేజీలు ప్రయివేట్ కరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ కోరారు. శుక్రవారం ఆమె ప్రజా ఉద్యమం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు, వైస్ చైర్ పర్సన్ ఉలాల భారతి దివ్య, మునిసిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ లాబాల స్వర్ణమని, జిల్లా ఎస్ సి విభాగం కార్యదర్శి కుందేశీ ప్రియా నియోజకవర్గ యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, మండలపార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖర్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఇసురు తులసీ రామ్ కాళ్ల సత్యం వైస్ ఎంపీపీ దున్న గురుమూర్తి సర్పంచ్ లు నర్తు వరప్రసాద్, నీలాపు సారధి రెడ్డి, దుక్క ధనలక్ష్మి పిట్ట బాలరాజు .కారింగి త్రినాధ్ సంతోష్ మొండలో, ఎంపీటీసీలు నీలాపు జగదీష్ రెడ్డి, నీలాపు ఢిల్లీ సాలిన ఢిల్లీ బొండాడ మహేష్ అనుబంధవిభాగాల అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమం కోసమే ఉద్యోగ భవిష్య నిధి

**-పీఎఫ్ కమిషనర్ నితీష్ కుమార్ సింగ్**



**పలాస, అక్టోబరు 24(వార్త):** కార్మికుల సంక్షేమం కోసమే ఉద్యోగ భవిష్య నిధని విశాఖపట్నం చెందిన పిఎఫ్ కమిషనర్ నితీష్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం పలాస పిసిఎంఎ కార్యాలయంలో జీడి పరిశ్రమ యజమాలతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల భవిష్య భద్రత కోసం ఏర్పాటు చేసిన ప్రధానమైన సామాజిక సంక్షేమ పథకం అని, దీని ప్రధాన ఉద్దేశం, కార్మికుల పదవీ విరమణ తర్వాత లేదా అత్యవసర పరిస్థితుల్లో వారికి ఆర్థిక సాయం అందించడమే అన్నారు.దీని లక్ష్యం సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులకి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యమన్నారు. ఇది ఉద్యోగి వేతనం నుంచి ఒక శాతం, అలాగే యాజమాని పేస్‌రోల్ నుంచి సమాన శాతం (ప్రతి ఒక్కరూ 12%) వంతుగా భవిష్య నిధిలో జమ చేయాలని అన్నారు. పిఎఫ్ పథకం ద్వారా ప్రభుత్వం కార్మికుల జీవన స్థాయిని మెరుగుపరచటమే కాకుండా, భవిష్య భద్రతను కూడా నిర్ధారిస్తోందని తెలిపారు. దీని ద్వారా కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి వేతన బోనస్, నైపుణ్య అభివృద్ధి, మరియు సురక్షిత భవిష్య భద్రత వంటి అదనపు లాభాలు కలుస్తాయని చెప్పారు. సంక్షేపంగా చెప్పాలంటే, ఉద్యోగ భవిష్య నిధి కార్మికుల కోసం ఆర్థిక భద్రత, పదవీ విరమణ అనంతర ఉపాధి, సమగ్ర సంక్షేమానికి పునాదిగా నిలుస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో పలాస పిసిఎంఎ అధ్యక్ష కార్యదర్శులు మల్లా శ్రీనివాసరావు, టంకల రవిశంకర్ గుప్తా, కోశాధికారి మల్లా సంతోష్, పారిశ్రామికవాడ అధ్యక్షులు మల్లా రామేశ్వరరావు, కార్యదర్శి తూముల శ్రీనివాసరావు, ఉప అధ్యక్షులు తాలాసు, శ్రీనివాసరావు, చుండూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలి

**మెళియాపుట్టి, అక్టోబరు 24(వార్త):** మధ్యాహ్న భోజన పథకం ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని మెనూ ప్రకారం వారికి అందించాలని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మెలియాపుట్టి మండల కేంద్రంలో గల ఎస్ డి ఆర్ ఆర్ ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఆధార్ వెరిఫికేషన్ సెంటర్ ను శుక్రవారం నాడు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో ఎవరివైనా ఆధార్ లో తప్పులు నమోదయి ఉంటే మండలంలో ప్రస్తుతం చాపరా మెలియాపుట్టి పెద్ద పద్మాపురం పరశురాంపురం లలో ఆధార్ వెరిఫికేషన్ సెంటర్లు పనిచేస్తున్నాయని అక్కడికి వెళ్లి ఆధార్లో తప్పులను సరిచేసుకోవచ్చు అన్నారు. కాలేజీలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల కొరకు ఆహార పదార్థాలను ఆయన పరిశీలన చేశారు. అనంతరం చాపర ఎస్ కె కె జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఆధార్ వెరిఫికేషన్ సెంటర్ సందర్శించి పరిశీలించారు. ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపల్, స్థానిక కార్యదర్శి కిషోర్, అధ్యాపకులు తదితరులున్నారు.



జాతీయ

# వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం




## జ్ఞానభారతి స్కూల్‌లో వ్యాచరచన పోటీలు

**ఇచ్ఛాపురం, అక్టోబరు 24(వార్త):** సత్య సాయి సేవ సంఘం ఆధ్వర్యంలో జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8 నుండి 10వ తరగతి విద్యార్థులకు కర్తవ్యమే దైవం, ఇంటర్ విద్యార్థులకు రేపటి భవిష్యత్తు మన చేతిలో ఉంది అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జ్ఞాన భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రెటరీ,సీఈఓ జోహార్ ఖాన్, కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రసీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్‌ఖాన్ పాల్గొన్నారు.



# కార్పొరేట్ మతతత్వ మనువాద శక్తులను ప్రతిఘటిద్దాం!




**పలాస, అక్టోబరు 24(వార్త):** మన రాష్ట్రంలో అభివృద్ధి – సంపద సృష్టి సంక్షేమం తెస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన డబల్ ఇంజన్ సర్కారు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని హామీలిచ్చిన బాబు ప్రస్తుతం సంపదను కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే కార్యక్రమంలో ఉన్నారని వామపక్ష నేతలు మండిపడ్డారు. శుక్రవారం పలాస– కాశీబుగ్గ పట్నాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ప్రజా సంపద అయిన లాభాల్లో నడుస్తున్న విశాఖ స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పడానికి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. గతంలో గంగవరం పోర్టును మత్స్యకారులుపై కాల్పులు జరిపి మరి అదానీ కంపెనీకి అప్పచెప్పారని మండిపడ్డారు. బాక్సెట్ గనులను జిందాల్ కంపెనీకి, కడప గనులను మిట్టల్ కంపెనీకి అప్పచెపుతున్నారు. అధికారం కోసం ఇచ్చిన సూపర్ సిక్స్ సూపర్ ఫ్లాప్ గా మిగిలిందని ధ్వజమెత్తారు. మతోన్మాద శక్తులకు దన్నుగా ప్రోత్సాహం అందిస్తూ అధికార వర్గమే కార్యక్రమాలు చేపడుతుందని మండిపడ్డారు. మనువాద భావజాలంతో యువత ప్రభావితం అవుతున్నారు. మహిళలపై అత్యాచారాలు, షెడ్యూల్ కులాలపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్ బిజెపిల మోడి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని క్రమ క్రమంగా నిర్వీర్యం చేస్తూ వారి సొంత మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. రాజ్యాంగ బద్ధ ప్రజాస్వామిక సంస్థలైన సిబిఐ, ఈడీలు మొదలు న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం వరకూ మోడి ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించే పరిస్థితులు నెలకున్నాయని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి ఎర్రబుక్కు రాజ్యాంగాన్ని అమలు చేస్తాం మంత్రులే ప్రకటనలు చేస్తూ, ప్రజా పాలన కంటే కక్ష సాధింపు చార్యలకే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏ రకంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించి ప్రతి పక్షాల మీద దాడులు చేశారో ఇప్పుడు అదే పరిస్థితిని కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో పరస్పరం శత్రువులైనప్పటికీ మోధీ ఆజ్ఞలు అమలు చేయడంలోనూ, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను సమర్థిస్తూ కేసుల భయంతో నోరెత్తకుండా పార్లమెంటులో ఓటు వేయడంలోనూ ఇద్దరూ ఒకే రకమైన అసమర్థతను ప్రదర్శిస్తున్నారు. లేబర్ కోడ్లు, వ్యవసాయ చట్టాలు, ఉపరాష్ట్రపతి ఎన్నికలు లాంటి ప్రతి విషయంలోనూ అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకే అభ్యర్థికి ఓటు చేయడమే ఇందుకు నిదర్శమని అన్నారు. ఆంధ్రకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏవి అమలు చేయడం లేదని, స్పెషల్ స్టేటస్ లేదు పోలవరం ప్రాజెక్టుకు నిధులు అంతంత మాత్రమే. కేంద్రం నుండి నిధులు రాబట్టడానికి బదులు అప్పులకు గ్యారంటీతో సరిపెట్టుకునే పరిస్థితి దాపురించిందని తెలిపారు. రాష్ట్రంలో వెనకబడి నటువంటి ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రకాశం జిల్లాలను అభివృద్ధి చేయడానికి, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నిలుపుదల చేయడానికి, రాష్ట్రానికి స్పెషల్ స్టేటస్ సాధించడానికీ, నానాటికీ ప్రతి రంగంలో హద్దులు మీరిన ప్రైవేటీకరణని నిలువరించడానికి ప్రజా ఉద్యమాలే తృతీయ ప్రత్యామ్నాయం.. అందు కోసం వామపక్ష, విప్లవ ప్రజాస్వామ్య వాదులు అందరూ కలిసి ఐక్య ఉద్యమాలు నిర్మించడమే మార్గమని,ఆదిశలోనే డిశెంబర్ 6,7తారీఖుల్లో కడపలో జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయడానికి సహాయ సహకారాలు అందివ్వాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (యంయల్) లిబరేషణ్ జిల్లా కార్యధర్శి తామాడ సన్యాసిరావు, ఎఐకేయం నాయకులు మద్దిల రామారావు, ఎఐసిసిటియు జిల్లా నాయకులు పోతనపల్లి కామేశ్వరరావు, పిన్నింటి నాగేశ్వరావు,కుత్తుం లోకనాదం, మహిళలు ,తాపీ మేస్రిలు పాల్గొన్నారు.



## కరవంజ ప్రతిభా పోటీల్లో విజేతలు వీరే

**జలుమూరు, అక్టోబరు 24(వార్త):** కరవంజ మోడల్ స్కూల్లో శుక్రవారం మండల స్థాయి హై స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీలను నిర్వహించారు. 14 హైస్కూల్లో విద్యార్థులుకు నిర్వహించిన వ్యాచారచన పోటీల్లో ప్రథమ విజేతగా రావాడ భాగ్యశ్రీ, శ్రీముఖలింగానికి చెందిన చంద్రకళ ద్వితీయ స్థానం, దీపిక పెద్దదూగాం హై స్కూల్ మూడో స్థానంలో నిలిచింది.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరణ



**సారవకోట, అక్టోబరు 24(వార్త):** సారవకోట మండలం బొంతు జంక్షన్లో ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో శుక్రవారం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జి ధర్మాన కృష్ణ చైతన్య పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు..మాట్లాడుతూ అక్టోబర్ 28న నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# పలాసలో వైయస్‌ఆర్సీపీ ప్రజా ఉద్యమం పోస్టర్ ఆవిష్కరణ



**పలాస, అక్టోబరు 24(వార్త):** ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్సీపీ ప్రజా ఉద్యమం కార్యక్రమంలో భాగంగా ఈనెల 28వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రంలో ర్యాలీలు నిర్వహించాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 9వ వార్డు వెంకటేశ్వర కాలనీలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ర్యాలీ పోస్టర్ ఆవిష్కరించి, పేదలకు నాణ్యమైన వైద్య సేవలు, పేద విద్యార్థులకు ఉచిత వైద్య విద్యను దూరం చేసే కూటమి ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. 28వ తేదీన పలాస–కాశీబుగ్గ జంట పట్టణంలో జరగబోయే ర్యాలీ కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యం తో విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ గుజ్జు జోగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బోర కృష్ణ రావు, మీసాల సురేష్ బాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు శిస్టు గోపి, మాజీ ఏఎంసి చైర్మన్ పీవీ సతీష్, వైసీపీ నాయకులు బడగల బాలచంద్రుడు, దున్న సత్యం, నర్తు వెంకటరమణ, సుజాతపండ, మల్లా సురేష్, పోతనపల్లి హరి, వాయలపల్లి లక్ష్మణ రావు, తూముల శ్రీనివాసరావు, కొంచాడ రాజేశ్రీకాంత్, రంది రాజారావు, బమ్మిడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల పనితీరుపై విద్యార్థులకు అవగాహన



**పలాస, అక్టోబరు 24(వార్త):** పోలీసుల పనితీరు, రెగ్యులర్ ఆక్టివిటీస్‌పై స్టూడెంట్స్‌కు అవగాహన కలిగి ఉండాలని కాశీబుగ్గ సిఐ పి. సూర్యనారాయణ అన్నారు. పోలీస్ అమరవీరుల స్మారకోత్సవాలలో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్‌ల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిబ్బంది విధులు, బాధితులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసే విధానం, విచారణ, సైబర్ వలలో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికల రక్షణకు ఏర్పాటు చేసిన భరోసా కేంద్రం సేవలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాశిబుగ్గ సీఐ పి. సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర కీలకమైందని, సమాజాన్ని కాపాడే బాధ్యత ఈ వ్యవస్థపై ఎక్కువగా ఉందని అన్నారు. కాశీబుగ్గ మేధా పాఠశాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులకు " ఓపెన్ హౌస్" కార్యక్రమం నిర్వహించి, పోలీసు స్టేషన్ లో సిబ్బంది విధులు నిర్వహించే గదులు, నేరస్థులను ఉంచే గదుల పని తీరును వివరించారు. కార్యక్రమంలో కాశీబుగ్గ ఎస్సై నరసింహ మూర్తి, పలువురు పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# గృహ వసతి లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోండి

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**పోలాకి, అక్టోబరు 24(వార్త):** నిరుపేద కుటుంబాలకు చెందిన వారు గృహ వసతి కల్పించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని బగ్గు రమణ మూర్తి తెలిపారు. కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఐదు లక్షల గృహాలను నిర్మించే దిశగా ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ క్రమంలో గృహ వసతి లేని నిరుపేదలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సంబంధిత మండల గృహ నిర్మాణ శాఖ అధికారులకు దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు తో పాటు రేషన్ కార్డు కూడా జతచేస్తూ నవంబర్ 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు



# వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ.. సంతకాల సేకరణ




**పలాస, అక్టోబరు 24(వార్త):** ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటుకరణకు చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ప్రైవేటుకరణకు వ్యతిరేకించింది గాను వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించి, కోటి సంతకాల సేకరిస్తున్నట్లు పలాస మండల వైసీపీ అధ్యక్షులు దువ్వాడ రవి, వైసీపీ జిల్లా అధికారి ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావులు అన్నారు తర్లకోట పంచాయితీ దానగుర గ్రామంలోసర్పంచ్ కోర్ల శివ కృష్ణ(సంతు) అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిదిగా పాల్గొన్నా మండల పార్టీ అధ్యక్షుడు దువ్వాడ రవి మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టం గురించి తన అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు . ఈ కార్యక్రమ%శీ% లో జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, వైస్ సర్పంచ్ రమేష్, యస్. బైరాగి, వార్డ్ మెంబెర్స్ మండల పార్టీ కార్యదర్శి , ఖగేష్ , లంబాడా మోహనరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బాడ జగ్గారావు, విజయ్ భవాని, దానాయ్యు, తారక్, ఎస్. ధర్మారావు పార్టీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ

**ఇచ్ఛాపురం, అక్టోబరు 24(వార్త):** బెల్లుపడ గ్రామంలో 14వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి నీలపు ఢిల్లీ చిన్నాన్న, 12వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బుడ్డెపు త్రినాథ్ మామయ్య, 13వ వార్డు వైస్సార్సీపీ అభిమాని నీలపు కృష్ణయ్య ఇటీవలి మృతి చెందారు. జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ పిరియా విజయ పాల్గొని, వారి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ,రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్,నియోజకవర్గ మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షులు కాళ్ళ సత్యం,యువజన సంఘ విభాగ అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్,వైస్ ఎంపీపీ శ్రీ దువ్వు వివేకానంద రెడ్డి, పిలక సంతు, ఈదుపురం సర్పంచ్ నర్తు ప్రసాద్, ఇన్నేసుపేట సర్పంచ్ ఇసురు తులసిరాం, కేదారిపురం ఎంపీటీసీ నీలపు జగదీష్, లోపింటి ఖఘపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546